క్లుప్తంగా

జేపీఎస్‌లతోనే బీఆర్‌ఎస్ పతనం

జనగామ: రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) రెగ్యులరైజ్‌లో ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వ విధానాలు సమంజసం కాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బేజాటి బీరప్ప అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఆగం చేస్తే.. బీఆర్‌ఎస్ పతనం తప్పదని హెచ్చరించారు. జేపీఎస్‌లను తొలగించే విధంగా తీసుకు వచ్చిన జీవోను వెంటనే రద్దు పర్చి, జేపీఎస్‌ల న్యాయబద్ధమైన కోర్కెలను నెరవేర్చాలన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



జనగామ: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, అంగన వాడీటీచర్లు, ఆశా కార్యకర్తలకు సీపీఆర్ (సడెన్ కార్డియాక్ అరెస్ట్)పై సోమవారం అవగాహన కల్పించారు. డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ రవితేజ ఆధ్వర్యంలో అకస్మాత్తుగా గుండె పోటుకు గురై కుప్ప కూలిపోయిన సమయంలో సీపీఆర్ ఎలా చేయాలనే దానిపై బొమ్మ సహాయంతో చూపించారు. డాక్టర్ మౌనిక, సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

దేవరుప్పుల: అకాల వర్షం బాధిత రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని కొడకండ్ల మార్కెట్ డైరెక్టర్ మైదం జోగేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న మడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.

'దళితబంధు'ను అవినీతి బంధుగా మార్చారు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దళితబంధును అవినీతిబంధుగా మార్చారని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ అన్నారు. దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టాను సీఎం కేసీఆర్ బహిరంగ పర్చాలని మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో డివిజన్‌కేంద్రంలో చేపట్టిన నిరసన నిరాహార దీక్షలు మంగళవారంతో ఎనిమిదవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిలుగా హాజరైన వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, సుధాకర్, కుమార్, ఏలియా పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో పాల్గొనాలి



బచ్చన్నపేట: యువకులు సీఎం కప్ క్రీడాపోటీల్లో పాల్గొనాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో సీఎం కప్ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాలకుర్తి టౌన్: ఈనెల 15న నుంచి నిర్వహించనున్న మండల స్థాయి (సీఎం కప్) క్రీడా పోటీలను క్రీడాకారులు వినియోగించుకోవాలని ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

దేవరుప్పుల: శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17 వరకు మండల స్థాయి పలు విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను కొనసాగనున్నట్టు ఎంపీడీఓ రవీందర్ మంగళవారం పేర్కొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తరిగొప్పుల: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వీఓఏల మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరవధిక మెరుపు సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనంగా రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల సాధారణ ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ కేవీ ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా కోశాధికారి నాగభూషణం, మండల అధ్యక్షురాలు పంగ సువర్ణ, నాగరాజు, బాలయ్య, బాబు, రేణుక, రాజేశ్వరి, రమణ, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బచ్చన్నపేట: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని ఆలింపూర్‌లో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..రాగీరు కుమారస్వామికి చెందిన గేదె పొలం వద్ద గడ్డి మేస్తుండగా విద్యుత్ సర్వీసు వైరుకు కరెంటు సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



జనగామ: హనుమాన్ శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జనగామ పట్టణంలో మంగళవారం వీర హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గణేష్ స్ట్రీట్ హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేసి ర్యాలీ ప్రారంభించారు. గుండ్లగడ్డ, అమ్మబావి, రైల్వేస్టేషన్, పోలీస్టేషన్, నెహ్రూపార్కు మీదుగా ఫ్లై ఓవర్ నుంచి బాణాపురం శ్రీ ఆంజనేయ టెంపుల్‌కు చేరుకుంది. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. హనుమాన్ స్వాముల శరణు ఘోషలతో పురవీధులు పులకించిపోయాయి.

రైల్వేస్టేషన్ వద్ద ఎమ్మెల్యే స్వాగతం

హనుమాన్ ర్యాలీకి రైల్వేస్టేషన్ ఆవరణలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి స్వాగతం పలికారు. స్వామికి పూజలు చేసి, జనగామ ప్రజలు చల్లంగా ఉండేలా దీవించాలని కోరుకున్నారు. స్వాములతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. మున్సి పల్ చైర్ పర్సన్ పోకల జమునలింగయ్య, స్థానిక కౌన్సిలర్



బచ్చన్నపేట: శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

మహంకాళి హరిశ్చంద్రగుప్త, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ బాల్దె సిద్ధిలింగం, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, మేక బాలసిద్దయ్య, నీల రాంమ్మోహన్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, విజయ్‌కుమార్ బజాజ్, వల్లాల మధు, కృష్ణజీవన్ బజాజ్, ధర్మపురి శ్రీనివాస్, చింతకింది మల్లేషం, మల్లిగారి మధు, కేవీఎల్ ఎన్‌రెడ్డి, సముద్రాల సందీప్, కందుకూరి శ్రీనివాస్, రాజు, చంద్రయ్య, శివరాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ మహాయజ్ఞం

నర్మెట: మచ్చుపహాడ్‌లో హనుమాన్ మాలధారణ స్వాములు మంగళవారం మహాయజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాములు నేతావత్ రాజేందర్, బైరగోని రాజు, నేతావత్ హన్మంతు, ఒస్సారి రాజు, రాయారపు కృష్ణ, భూక్య నవీన్, గురుస్వాముల నరహరి, శివ, స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర

బచ్చన్నపేట: మండల కేంద్రంలో హనుమాన్ మాలాధారులు ఘనంగా శోభాయాత్రను నిర్వహించారు. మంగళవారం చెన్నకేశవాలయంలో స్వాములు యజ్ఞం, హోమాలను నిర్వహించి భజన కార్యక్రమం చేపట్టారు. అలాగే హనుమాన్ విగ్రహంతో వీధుల్లో యాత్ర నిర్వహించారు. ఆలయం వద్ద పడమటికేశ్వాపూర్ సర్పంచ్ గిద్దెల రమేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



రఘునాథపల్లి: విజయదుర్గాదేవికి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: రేణుకా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

రఘునాథపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామ దేవతల ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్సీ పాల్గొనగా గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఎస్‌బీఐ బ్యాంకు నుంచి నూతనంగా నిర్మించిన విజయదుర్గాదేవి ఆలయం వరకు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఎల్లమ్మతల్లి ఆలయానికి చేరుకొని కడియం పూజలు చేశారు. సర్పంచ్ పోకల శివకుమార్, జెడ్పీటీసీ బొల్లం మణికంఠ, జిల్లా రైతుబంధు సభ్యుడు రాంబాబు, గొరిగె రవి పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తా..

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామ అభివృద్ధికి తన పూర్తి సహాయ, సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న గౌడ కులస్తుల ఆరాధ్యదైవాల ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన మంగళవారం ఉత్సవ కమిటీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, కమిటీ బాధ్యులు, గౌడ కులస్థుల ఆధ్వర్యంలో విశేష పూజలను చేపట్టారు. కాగా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హాజరై శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి తనవంతుగా రూ.50వేలు విరాళంగా అందించారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

ఇప్పగూడెంలో శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి హాజరై ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎల్లగౌడ్, ఏసీపీ రఘుచందర్, సర్పంచ్ జక్కుల పరుశరాములు, ఎంపీటీసీలు విజయలక్ష్మి, శైలజఅజయ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాకయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు యాదగిరి, రవీందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దేవతలు అవతరించిన పుణ్యభూమి



ప్రసాద్‌జీని సత్కరిస్తున్న నిర్వాహకులు

జనగామ: సాక్షాత్తు పరమశివుడు తపస్సు చేసిన తపోభూమిలో 33 కోట్ల మంది దేవతలు అవతరించారని తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత ప్రముఖ్ ప్రసాద్‌జీ అన్నారు. పట్టణంలోని బాణాపురం హనుమాన్ ఆలయంలో సోమవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాముడు, శ్రీ కృష్ణుడు అవతారం ఎత్తి పరిసమాప్తి చెందగా, హనుమంతుడు నేటికి చిరంజీవిగానే ఉన్నారన్నారు. ఇంతటి మహత్తరమైన హిందూ దేశం గొప్పదనాన్ని చాటుతూ ముక్కోటి దేవతలు సైతం గానం చేస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శ్రీరాంశ్రీనివాస్, మేక బాలసిద్దయ్య, విజయ్‌కుమార్ బజాజ్, వెంకటరత్నం, మహంకాళి హరిశ్చంద్రగుప్త, మధు, కేవీఎల్ ఎన్‌రెడ్డి, నీల రాంమ్మోహన్, సముద్రాల సందీప్, క్రిష్ణజీవన బజాజ్ తదితరులు ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, చివరి ధాన్యం గింజవరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాజయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1,962 మద్దతు ధరతో కొనుగోలు చేస్తారన్నారు. అదేవిధంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ నాగేశ్వరశర్మ, మార్కెట్‌కార్యదర్శి జీవన్ కుమార్, వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జ్ ఐత సంతోష్, మార్కెట్ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించే ప్రసక్తే లేదు

రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/దేవరుప్పుల/కొడకండ్ల/జఫర్‌గఢ్: తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హెచ్చరించారు. రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో వారు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ గత పన్నెండు రోజులుగా జేపీఎస్‌లు సమ్మె చేస్తుండగా స్పందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు గురిచేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. కాగా, కొడకండ్ల, దేవరుప్పుల మండలంలో దీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. అలాగే జఫర్‌గఢ్‌లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గోపు సోమయ్య విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం తొలగిస్తామనడం సరికాదన్నారు. వెంటనే జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.



స్టేషన్‌ఘన్‌పూర్: నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

నోటీసులు తీసుకునేది లేదు

పాలకుర్తి టౌన్: జేపీఎస్‌లు ప్రభుత్వ ఆదేశాలమేరకు మంగళవారం సమ్మె విరమించాలని లేనిపక్షంలో తొలగిస్తామని నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన డీఆర్‌డీఓ జి.రాంరెడ్డి, పాలకుర్తి ఎంపీడీఓ అశోక్‌కుమార్ రాగా వాటిని తీసుకోవడానికి నిరాకరించారు. ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు నోటీసులు తీసుకునేది లేదని, సమ్మెను విరమించేంది లేదని జీఓ వస్తేనే జీపీలోకి వెళ్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఈజీఎస్ సిబ్బంది సంఘీభావం తెలిపారు.

తప్పతాగి యువకుడి హల్‌చల్

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యం మత్తులో ఓ యువకుడు తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, రైలు పట్టాలపై ఉన్నానని డయల్ 100కు ఫోన్ చేసి హల్‌చల్ చేసిన సంఘటన ఘన్‌పూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. ఘన్‌పూర్ ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన తొడెంగల నాగరాజు అనే యువకుడు సోమవారం రాత్రి మద్యం ఫుల్‌గా తాగాడు. ఘన్‌పూర్‌లో రైల్వే పట్టాల వద్ద ఉండి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, రైలు రావడమే ఆలస్యం అంటూ రాత్రి 9 గంటల ప్రాంతంలో డయల్ 100కు కాల్ చేశాడు. సదరు సమాచారం పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో అతడి ఫోన్‌ను ట్రేస్ చేసి రైల్వే సబ్‌స్టేషన్ సమీపాన మద్యం మత్తులో పడుకుని ఉండటాన్ని గుర్తించారు. మద్యం మత్తులో ఉన్న అతడిని పోలీసులు స్థానిక స్టేషన్‌కు తరలించారు. అనవసరంగా 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సమయం వృథా చేసినందుకు అతడిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రఘునాథపల్లి: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన రఘునాథపల్లి మండలంలోని గోవర్ధనగిరిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుస్స యాదగిరి(52) వ్యవసాయంతో పాటు పాడిగేదెలతో జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం భార్య వసంతతో కలిసి ఆవులను కడిగేందుకు వ్యవసాయ బావివద్దకు వెళ్లారు. భార్య ఆవులను మేపుతుండగా ఒక్కో ఆవును కడిగేందుకు యాదగిరి విద్యుత్ మోటార్ ఆన్ చేశాడు. ఆవులను దగ్గరగా కట్టేసి నీళ్లు పట్టేందుకు గడ్డపార భూమిలో పొదిలేశాడు. పచ్చి గడ్డిలో స్టాటర్ నుంచి మోటార్‌కు విద్యుత్ సరఫరా అవుతున్న కేబుల్‌పైరును గమనించక దానిపై నేరుగా గడ్డపార దిగేయడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. దూరంగా ఉన్న భార్య గుర్తించి స్టాటర్ డబ్బాలోని ఫీజులను తొలగించింది. అప్పటికే యాదగిరి అపస్మారక స్థితికి చేరుకున్నారు. సమీపంలోని రైతులు చేరుకొని స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడుని పిలిపించి పల్స్ చెక్ చేయించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ సంతోష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సందుల శృతి (ఎంపీసీ-984)



కందుకూరి నిధి (బైపీసీ- 989)



స్వేత, ఫస్టియర్ (ఎంపీసీ-465)



దేవిశ్రీ, ఫస్టియర్ (బైపీసీ-433)



శాగుఫ్తా నాజ్, (సీఈసీ-478)



అక్షయ (బైపీసీ-978)



వైష్ణవి (ఎంపీసీ-977)



వంశీ (సీఈసీ-965)

జనగామ రూరల్: మంగళవారం ఇంటర్మీడియల్ ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా పలు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. జనగామ పట్టణంలోని ఏబీవీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్, యజమాన్యం తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో సందుల శృతి, బి.అలేఖ్య, కోంద్ర అమూల్యలు 984 మార్కులు సాధించి కళాశాల జిల్లా టాపర్‌గా నిలిచారన్నారు. బైపీసీలో కందుకూరి నిధి 989 మార్కులు, ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో మరిపల్ల యశస్విని స్వేత, కర్రె ప్రసన్న, మంద్రి చెందన 465 మార్కులు సాధించారని చెప్పారు. బైపీసీలో సీమా జబీన్, చెన్నోజు దేవిశ్రీ, 433 మార్కులు సాధించింది. సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో శాగుఫ్తా నాజ్ 478 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

నర్మెట మండలంలో..

నర్మెట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో బాలికలదే హవా కొనసాగింది. ఎంపీసీలో ప్రథమ స్థానంలో పి. భాగ్య 737 మార్కులు, నీరజ 645, బైపీసీలో అఖిల 892, అంజలి-850, సీఈసీలో రాజశేఖర్ 681, మానస-540 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

గురుకుల బాలికలు..

కొడకండ్ల: ఇంటర్ ఫలితాల్లో నూరుశాతం ఫలితాలతో కొడకండ్ల మండలకేంద్రంలోని టీఎస్ఆర్ ఎస్‌జేసీ బాలికలు ఆదర్శంగా నిల్చారు. ప్రథమ సంవత్సరంలో 70 మందికి గాను 70, ద్వితీయ సంవత్సరంలో 72 మందికి గాను 72 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. మోడల్‌స్కూల్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 91 మందికి గాను 73 మంది, ద్వితీయ సంవత్సరంలో 105 మందికి 99 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 65 మందికి 44 మంది, ప్రథమ సంవత్సరంలో 68 మందికి 59 మంది ఉత్తీర్ణులైనారు.

బాలికలదే పైచేయి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాలలో బాలికలదే పైచేయి ఉన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో సందెల మేఘన 913 మార్కులు, కె. దివ్య 890, సీఈసీలో బి. సానియా957, స్వాతి 939, బైపీసీలో కె.అమూల్య 937, ఉదయశ్రీ-905 మార్కులను సాధించినట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు..

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎంతో ప్రతిభ చూపారు. బైపీసీలో టి. అక్షయ 978/1000, ఎంపీసీలో ఇ.వైష్ణవి 977/1000, సీఈసీలో ఇ.వంశీ 965/1000 మార్కులు సాధించారు. అదేవిధంగా ఫస్టియర్ ఎంపీసీలో పి.కావ్య 447/470, బైపీసీలో బి.కల్యాణి 425/440, సీఈసీలో డి.రాజశ్రీ 446/500 మార్కులు సాధించారు. మోడల్ స్కూల్ ఇంటర్ సెకండియర్‌లో 88 శాతం, ఫస్టియర్‌లో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

జఫర్‌గఢ్ మండలంలో..

జఫర్‌గఢ్: మోడల్ కళాశాలల్లో ఎంపీసీ విభాగంలో 42 మంది విద్యార్థులకు గాను 42 మంది, సీఈసీ విభాగంలో 33 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ద్వితీయ సంవత్సరంలో 84 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 84 మంది ఉత్తీర్ణత సాధించారు. వెలుగు గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు..

పాలకుర్తి టౌన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినిలు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనుముల లక్ష్మీ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో 94 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రత్యేక అధికారి బైరపాక నవీన చెప్పారు. మండలంలోని గూడూరు గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 100 శాతం ఉత్తీర్ణతను సాధించగా, ప్రథమ సంవత్సరంలో 96 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు.



ఎం. కావ్య (ఎంపీసీ 979)



భవాని, ఫస్టియర్ (ఎంపీసీ-455)



నికిత (బైపీసీ -971)



బి దేవేందర్ (ఎంపీసీ-751)



బి. శ్రీకాంత్ (ఎల్ఎంఅండ్ డీటీ-946)

దేవరుప్పులలో ...

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో రెండవ సంవత్సరంలో 85 శాతం విద్యార్థులు, మొదటి సంవత్సరంలో 75 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్ తెలిపారు.

ఒకేషనల్‌లో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ఎస్‌వీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాల్లో 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎల్‌ఎం అండ్‌డీటీ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బోయిని శ్రీకాంత్ 946, ప్రథమ సంవత్సర విభాగంలో మానుపాటి శ్రావ్య 461 మార్కులు సాధించినట్లు నట్టు ప్రిన్సిపాల్ పాలబిందెల సుభాష్ తెలిపారు.



ఎలుసాని కీర్తిక (బైపీసీ-985)



కందికొండ శృతి (ఎంపీసీ-980)



జప్రాపు సృజన (ఎంపీసీ-980)



నేషశ్రీ, ఫస్టియర్ (ఎంపీసీ-465)



నవ్యశ్రీ, ఫస్టియర్ (బైపీసీ 434)



సందెల మేఘన (ఎంపీసీ-913)



బోరగాని సంజన (బైపీసీ-975)



నేతావత్ కల్యాణి (ఎంపీసీ-970)

సంక్షిప్తంగా..

కొనసాగుతున్న 'కంటివెలుగు'

బచ్చన్నపేట/నర్మెట/జఫర్‌గఢ్: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. కాగా, జఫర్‌గఢ్ మండలంలోని తమ్మడపల్లి(ఐ), నర్మెట మండలం వెల్దండ, బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన శిబిరాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించి మాట్లాడారు.

నేటి నుంచి 28వ వార్డులో 'కంటి వెలుగు'

జనగామ: పట్టణంలోని 28వ వార్డు కొత్తబస్తీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, గుండ్లగడ్డలో నేటి నుంచి (బుధవారం) ఐదు రోజుల పాటు (శని, ఆది వారం మినహా) కంటి వెలుగు వైద్య శిబిరం కొనసాగుతుందని సామాజిక ఆరోగ్య అధికారి రెహమాన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

లింగాలఘణపురం: బండ్లగూడెం బండగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో లక్ష్మీనర్సింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ స్థానాచార్యులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, సేవా సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు.

నేడు 'అలనాటి శతక' ఆవిష్కరణ

పాలకుర్తి టౌన్: పాలకుర్తి సోమేశ్వరుణ్ణి స్తుతిస్తూ స్వర్గీయ ముదిగొండ విరూపాక్షయ్య రచించిన శ్రీసోమేశ్వర శతకం పునర్ముద్రణ బుధవారం శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆవిష్కరించనున్నట్లు సంపాదకులు డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ మంగళవారం తెలిపారు.

న్యాయం చేయాలి

బచ్చన్నపేట: పోచన్నపేట శివారులోని 528 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో సేద్యం చేసుకుంటున్న తమను పక్క రైతు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, అతనిపై చర్య తీసుకొని న్యాయం చేయాలని బాధిత రైతులు తెలిపారు. ఈ మేరకు బాధిత వారు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధిత రైతులు నాగయ్య, చెంద్రయ్య,నర్సయ్య, బాలమణి, మల్లయ్య, యాదగిరి, ఉమేష్, నర్సయ్య, రాములు, బాలయ్య పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యంతో రైతుల ఇబ్బందులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని కాంటాలు చేయడంలో నిర్లక్ష్యంతో జాప్యం చేస్తుండగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం మండల నాయకులు తోట రమేష్, సముద్రాల రాజు అన్నారు. శివునిపల్లిలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు మంగళవారం పరిశీలించారు. నరేష్, యాదగిరి, సోమన్న, బాలన్న, మల్లయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుపాలని వార్డు సభ్యులు కుక్కల ఎల్లయ్యతో కలిసి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చందునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చెక్కుల పంపిణీ

చిల్పూరు: కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం తీసుకుని మృతి చెందిన రెండు కుటుంబాలకు మల్కాపూర్‌లో మంగళవారం కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు దేవి తిరుపతిరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.

ఎన్నిక



శిరాజ్ గుప్తా

నర్మెట: మండల సర్పంచ్‌ల ఫోరం నూతన అధ్యక్షుడుగా రామిని శివరాజ్ గుప్తాను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం సమావేశమైన 10మంది సర్పంచ్‌లు ప్రస్తుతమున్న ఆమెడపు కమలాకర్‌రెడ్డిని తొలగిస్తూ నూతన అధ్యక్షుడిగా రామిని శివరాజ్ గుప్తా , ఉపాధ్యక్షుడిగా లకావత్ కిరణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల శామీర్‌పేటలో గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల అధికారి మంగళవారం పేర్కొన్నారు.